ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 14.05.2026 సమయం: 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ఇంధన పొదుపు, విదేశీ మారకద్రవ్య సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు.

2. తెలంగాణలో ఇప్పటివరకు 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి 4 వేల 600 కోట్ల రూపాయలను రైతుల ఖాతాలో జమ చేశామని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

3. జూన్ 8 న చేపట్టే చేప ప్రసాదం పంపిణీకి అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని, హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు.

4. బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించిన సప్త సూత్రాలు అంశంపై ఈరోజు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.

------------------------------

**గవర్నర్**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ఇంధన పొదుపు, విదేశీ మారకద్రవ్య సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు గవర్నర్ వీడియో సందేశాన్ని లోక్ భవన్ విడుదల చేసింది. ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం నెలకొన్న పరిస్థితుల్లో.. డాలర్, పెట్రో డాలర్ల వినియోగాన్ని తగ్గిస్తూ విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయాల్సిన అవసరం ఉందని గవర్నర్ అన్నారు. దేశ

కరెన్సీ విలువను కాపాడటంలో ప్రతి పౌరుడూ బాధ్యతగా వ్యవహరించాలని ఆయన సూచించారు. తాను తెలంగాణ గవర్నర్ గా బాధ్యతలు చేపట్టిన నుండే వాహనాల వినియోగాన్ని తగ్గించానని పేర్కొన్న శివప్రతాప్ శుక్లా, ప్రధాని పిలుపు మేరకు వాహనాల వినియోగాన్ని మరో 50 శాతం వరకు తగ్గించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ శాఖల్లో వాహనాల వినియోగాన్ని తగ్గించేలా ముఖ్యమంత్రి , మంత్రివర్గ సభ్యులు, అధికారులకు సూచనలు ఇవ్వాలని ముఖ్యమంత్రిని కోరనున్నట్లు గవర్నర్ తెలిపారు.

**డెస్క్**

------------------------------

**ఉత్తమ్ కుమార్ రెడ్డి**

రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి ఇప్పటివరకు 4 వేల 600 కోట్ల రూపాయలను రైతుల ఖాతాలో జమ చేశామని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు.. గడచిన రెండున్నర సంవత్సరాలలో దేశంలో అత్యధికంగా వరి పండించిన, కొనుగోలు చేసిన రాష్ట్రం తెలంగాణ అని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. జిల్లా ఇన్చార్జి మంత్రి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి ఆయన నల్గొండ జిల్లా చెట్ల చెన్నారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రబీ ధాన్యం కొనుగోలుకు రాష్ట్రంలో 8 వేల 575 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, రానున్న రెండు, మూడు రోజుల్లో మరో 9 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు పంపిస్తామని చెప్పారు.

**పీటీసీ – నల్గొండ**

----------------------------

**సమీక్ష**

హైదరాబాద్ లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో జూన్ 8 న చేపట్టే చేప ప్రసాదం పంపిణీకి ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని,

హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. చేప ప్రసాదం పంపిణీపై ఈరోజు హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ లో జరిగిన సమీక్షలో మంత్రులు వాకిటి శ్రీహరి, అజారుద్దీన్ సహా పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. మృగశిర కార్తె సందర్భంగా ప్రతి సంవత్సరం మాదిరి ఈసారి కూడా చేప ప్రసాదం పంపిణీ జరుగుతుందన్నారు. వందల సంవత్సరాలుగా ప్రజల విశ్వాసాలకు అనుగుణంగా బత్తిని కుటుంబం చేప ప్రసాదం పంపిణీ చేస్తోందని అన్నారు. ఈసారి లక్ష 25 వేల చేప పిల్లలు అందుబాటులో ఉంచినట్లు మంత్రి చెప్పారు. 35 కౌంటర్ల ద్వారా చేప ప్రసాదం పంపిణీకి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.

డెస్క్

-------------------------------

**సింగరేణి**

సింగరేణిలో మహిళా శక్తికి ప్రాధాన్యతనిచ్చి ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించడంతో సింగరేణి చరిత్రలో తొలిసారిగా భారీ డంపర్ల ఆపరేటర్లుగా కొందరు మహిళలకు కంపెనీ అవకాశం కల్పించేందుకు చర్యలు చేపట్టింది. త్వరలో జారీ అయ్యే డంపర్ ఆపరేటర్ల నియామకాల్లో మహిళలకు కూడా అవకాశం కల్పించేందుకు రంగం సిద్ధంచేసింది. ఓపెన్ కాస్ట్ గనుల్లో బొగ్గు, ఓవర్ బర్డెన్ ను గని క్వారీ నుండి ఉపరితలానికి రవాణా చేయడానికి 60 నుంచి 100 టన్నుల భారీ డంపర్లను వినియోగిస్తుంది. సింగరేణిలో గత 50 ఏళ్లుగా నిర్వహిస్తున్న ఓపెన్ కాస్ట్ గనుల్లో ఇప్పటివరకు కేవలం పురుషులు మాత్రమే ఈ భారీ డంపర్లను నడుపుతూ వస్తున్నారు. అయితే, మహిళా శక్తిని సద్వినియోగం చేసుకోవాలని, వారి నైపుణ్యాలను, శక్తి సామర్థ్యాలను కూడా వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం సింగరేణిని ఆదేశించింది. ఈ నేపథ్యంలో సింగరేణి సంస్థ ఓపెన్ కాస్ట్ గనుల్లో డంపర్ ఆపరేటర్లుగా పని చేయడానికి ఆసక్తి గల మహిళా ఉద్యోగుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. దరఖాస్తు చేసుకున్న మహిళలకు శిక్షణ ఇచ్చింది. వారిలో శిక్షణ పూర్తిచేసుకున్న 13 మంది మహిళా ఉద్యోగులు.. తాము డంపర్ ఆపరేటర్లుగా పనిచేయటానికి సంసిద్ధంగా ఉన్నామని కంపెనీకి

తెలియజేశారు.

డెస్క్

------------------------------

**పీజేటీఏయూ**

హైదరాబాద్ లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఈరోజు 'భారత్–ఆస్ట్రేలియా స్మార్ట్ ఫార్మ్ నెట్‌వర్క్' ప్రారంభమైంది. రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సర్కిల్ ఆఫ్ హైదరాబాద్, చార్లెస్ స్టర్ట్ యూనివర్సిటీ, బెంగళూరు సైన్స్ అండ్ టెక్నాలజీ, జయశంకర్ యూనివర్సిటీల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా వాతావరణ అనుకూల వ్యవసాయం, డిజిటల్ వ్యవసాయ సాంకేతికతలు, ప్రిసిషన్ ఫార్మింగ్, నవకల్పనలు, స్థిరమైన వ్యవసాయ విధానాల్లో భారత్–ఆస్ట్రేలియా దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య మాట్లాడుతూ... విద్యా సంస్థలు, పరిశ్రమలు, సాంకేతిక నిపుణులు, రైతుల మధ్య సమన్వయాన్ని పెంపొందించడంలో ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. 2047 నాటికి మానవ రహిత వ్యవసాయం దిశగా దేశం ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు.

డెస్క్

--------------------------

**మీసేవా**

ఈనెల 21, 22 తేదీల్లో జరగనున్న డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ హాల్ టికెట్లను రేపటి నుంచి మీ సేవ వాట్సాప్ ద్వారా పొందవచ్చునని అధికారులు తెలియజేశారు. మీ సేవ అధికారిక వాట్సాప్ నంబర్ 8096958096 కు హాయ్ అని మెస్సేజ్ పంపించడం ద్వారా ఆప్షన్లను నమోదు చేసి హాల్ టికెట్ రిసీవ్ చేసుకోవచ్చన్నారు.

డెస్క్

-------------------------------

**పురస్కారాలు**

రాష్ట్రంలోని బీసీ గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో చదివి అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు హైదరాబాద్, బంజారాహిల్స్ లోని కొమురంభీం భవన్ లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈరోజు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను మొత్తం 508 మంది ప్రతిభావంతులైన విద్యార్థులను సన్మానించారు. పదో తరగతిలో 214 మంది, ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరంలో 165 మంది, మొదటి సంవత్సరంలో 129 మంది విద్యార్థులకు పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామీణ, పేద, వెనుకబడిన కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులు సాధించిన ఈ విజయం సమాజానికి స్ఫూర్తిదాయకమని అన్నారు.

**డెస్క్**

---------------------------------

**సప్త సూత్రాలు**

BJP తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించిన సప్త సూత్రాలు అంశంపై ఈరోజు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు 10 సూచనలతో కూడిన కరపత్రాన్ని ఈ సందర్భంగా విడుదల చేశారు. స్వదేశీ వినియోగం, ఇంధన పొదుపు, దేశీయ పెట్టుబడులు "ఆత్మనిర్భర్ భారత్" లక్ష్య సాధనకు కీలకమని పేర్కొన్నారు. ఆర్థిక నిపుణుడు ప్రొఫెసర్ కృష్ణారెడ్డి సప్త సూత్రాలపై విశ్లేషణ చేస్తూ, సామాన్య పౌరులు చిన్నచిన్న మార్పులు చేసుకుంటే దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని వివరించారు.

**డెస్క్**

---------------------------

**వాతావరణం**

రాష్ట్రంలో పలు జిల్లాల్లో అక్కడక్కడా వచ్చే మూడు రోజుల పాటు.. తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలియజేసింది. ఉరుములు మెరుపులతో పాటు.. 40 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. కాగా.. ఎల్లుండి నుండి ఉత్తర తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉంది.

**పీఎస్**

---------------------------